క్లుప్తంగా

రైతు బజార్‌లో కిలో టమాటా రూ.50

తెనాలిఅర్బన్: టమాటా ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రైతు బజార్‌లో విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కిలో రూ.50కే తెనాలి పట్టణంలోని రైతుబజార్‌లో సోమవారం విక్రయించారు. టమోటా ధరలు తగ్గే వరకు విక్రయాలు కొనసాగుతాయని బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం



తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ వినియోగంతో ప్రమాదమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పిలుపునిచ్చారు. ఎస్‌సీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్ ఎన్‌సీసీ అధికారి పి.భాస్కరరావు ఆధ్వర్యంలో సోమవారం ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం-పర్యావరణాన్ని కాపాడుద్దాం అనే నినాదంతో మార్కెట్ నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 800 చేతి సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.శివసాయిప్రసాద్, వేజళ్ల నవ్య, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కోటయ్య సేవలు మరవలేనివి

తెనాలిఅర్బన్: కమ్యూనిస్ట్ నాయకుడుగా గద్దె కోటయ్య చేసిన కృషి మరువరానిదని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొల్లిముంత కృష్ణ, నీలాంబరం కొనియాడారు. సీపీఐ నాయకుడు గద్దె కోటయ్య 43వ వర్ధంతిని కొలకలూరులో సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి తెనాలి అధ్యక్షుడు తోట నాగేశ్వరరావు, నాయకులు ఆరేటి రామారావు, గద్దె అప్పారావు, తోట మల్లయ్య, గుంటూరు కృష్ణమోహన్, తుపాకుల మణికంఠ పాల్గొన్నారు.

మైనింగ్ నిధులతో అభివృద్ధి పనులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని 2014 - 19 సంవత్సరాలకు గాను జరిగిన మైనింగ్ తవ్వకాలకు సంబంధించి మండలానికి రావలసిన నిధులు రూ.4కోట్లు మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో విడుదలయ్యాయి. ఆ నిధులతో మండలంలోని 18 గ్రామాల్లో అభివృద్ధి పనులను మండల ఇంజినీరింగ్ శాఖ అధికారులు ప్రారంభించారు. దుగ్గిరాల మండల పరిధిలో రూ.40 లక్షల వ్యయంతో 575.50 మీటర్ల పొడవున సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. దుగ్గిరాల గ్రామ పరిధిలో నాగళ్ల కృష్ణప్రసాద్ ఇంటి వద్ద నుంచి ఎయిర్‌టెల్ టవర్ వరకు 130.50 మీటర్లు, షేక్ బాజి నివాసం నుంచి ఎస్‌కే సంధాని ఇంటి వరకు 70 మీటర్లు, షేక్ వహీద్ ఇంటి నుంచి పటాన్ జున్ను ఖాన్ నివాసం వరకు 28.20 మీటర్లు, ఎండీ రఫీవుల్లా నివాసం నుంచి పటాన్ సుభాని నివాసం వరకు 121.50 మీటర్లు, కడప దర్గా రోడ్ (ఆలీనగర్) 25.30 మీటర్లు, గంటా జెర్రి థామస్ నివాసం నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వరకు 200 మీటర్లు మొత్తం 575.50, మిగిలిన రూ.3కోట్ల 60 లక్షలకు సంబంధించి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో వున్న రహదారులు, డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు మండల ఏఈ రమేష్ రెడ్డి తెలియజేశారు. సీఎండీఎఫ్ నిధుల నుంచి రూ.15లక్షలు కేటాయించగా దుగ్గిరాల గ్రామంలో నిమ్మగడ్డ కోటేశ్వరరావు నివాసం నుంచి తాడిబోయిన నాగరాజు నివాసం వరకు 76.50 మీటర్ల మేర రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణం, రూ.10 లక్షల వ్యయంతో మోరంపూడి గ్రామంలో కూచిపూడి చిన్న ఇశ్రాయేలు నివాసం నుంచి కూచిపూడి దయాకర్ నివాసం వరకు 72 మీటర్లు, కూచిపూడి సురేష్ నివాసం నుంచి అమృతలూరి అరవింద నివాసం వరకు 71.30 మీటర్ల మేర సీసీ రోడ్ నిర్మాణం చేపట్టినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఏఈ రమేష్ రెడ్డి తెలిపారు.

ఓటరు లిస్టులను క్షుణ్ణంగా పరిశీలించాలి

తాడేపల్లిరూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించి తుది జాబితాను తయారు చేసే విధంగా పనిచేయాలని మంగళగిరి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లలిత అన్నారు. సోమవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని 18 గ్రామాలకు సంబంధించిన బీఎల్ఓలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లలిత మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికల కమిషన్ 2024కు సంబంధించి తుదిజాబితాను విడుదల చేయనున్నదని, ఈలోపు ప్రతి బూత్‌లోను పనిచేస్తున్న బీఎల్ఓలు వారి పరిధిలో వున్న ఓటర్‌లిస్టులలో డబుల్ ఎంట్రీలు తొలగించడం, మృతిచెందిన వారి వివరాలు తీసివేయడం, సంబంధిత ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళితే అక్కడ ఓటు నమోదు చేయడం, దానితో పాటు కొత్త ఓట్లను నమోదు చేసే ప్రక్రియను ప్రతి ఒక్కరు చేపట్టాలన్నారు.

భక్తి శ్రద్ధలతో సాయి మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు

తెనాలి టౌన్: పట్టణంలోని సాయి, షిరిడి సాయి మందిరాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాలు సాయినామ కీర్తనలతో మార్మోగాయి. మందిరాల్లో ఉన్న షిరిడి సాయి బాబాకు భక్తులు అభిషేకాలు, పూజలు జరిపారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో బాబావారిని అలంకరించారు. బోసురోడ్డులోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా బాబావారికి క్షీరాభిషేకం చేశారు. భజనలు చేశారు. సాయంత్రం బాబాను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మందిరం ప్రెసిడెంట్ నన్నపనేని బాలదుర్గాప్రసాద్, కృష్ణకుమార్, ఎం.వెంకటేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.



బోసురోడ్డులోని సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

- గంగానమ్మపేటలోని రామేశ్వస్వామి దేవస్థానంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పర్వతవర్ధని అమ్మవారు, శ్రీ అష్టభుజ దుర్గాదేవికి కూరగాయాలతో శాకంబరి అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యనిర్వహణాధికారి రమణకుమారి, అర్చకులు పెనుమూడి వెంకట సుబ్బారావు, పొత్తూరి వెంకట సురేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.
- గాంధీచౌక్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో శ్రీ సాయి ప్రసాదం సేవా సమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను జరిపారు. సమితి అధ్యక్షులు లక్కరాజు సాయి, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, అర్చకులు కిరణ్ పాల్గొన్నారు.
- ఐతానగర్‌లోని షిరిడి సాయి మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా పూజలు జరిపారు. బాబావారి శేష వస్త్రములు వేలం వేశారు. బాబావారికి హారతి, అనంతరం అన్నదాన కార్యక్రమం జరిపారు. ప్రత్యేకంగా అలంకరణ చేశారు.
- మారీసుపేటలోని షిరిడి సాయిబాబా మందిరంలో మందిరం అర్చకులు రఘురామశర్మ బాబా వారికి అభిషేకం చేసి హారతి ఇచ్చి పూజలు చేశారు.
- మారీసుపేటలోని అప్పలస్వామి గుడిలో షిరిడి సాయిబాబాకు అభిషేకాలు జరిపారు. పూజలు చేశారు. కార్యక్రమంలో శివానందకుమార్,నారాయణస్వామి, శివ ఆంజనేయప్రసాద్, అర్చకులు నాగ సర్వజ్ఞశర్మ, తేజిత్, పవన్, నారాయణ, విహాల్ శంకర్ పాల్గొన్నారు.
- షిరిడి సాయిరాం సంస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవాన్ని జరిపారు.అన్నదానం జరిపారు. ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్ బాబు, కౌన్సిలర్ గొడవర్తి సాయిహరేరామ్, శంకరరావు, సాయి బాబు పాల్గొన్నారు.
- సుల్తానాబాద్‌లోని శ్రీ సాయికుమార్ మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిపారు. బాబావారికి పంచామృతాలు, నవరసాలతో బ్రహ్మశ్రీ శ్రీనివాస్ శర్మతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సూర్యనారాయణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో మేనేజర్ సాయిరామ్, తాళ్లూరి సాంబయ్య, నాగళ్ల మోహన్‌కుమార్, ఉషా పాల్గొన్నారు.
- మారీసుపేట శివాలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా శాకంబరి అలంకరణలో బాలత్రిపుర సుందరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శేతు మాధవరావు, పొన్నూరు శశిధరరావు, హరిప్రసాద్, శేషగిరిరావు, అంకమ్మరావు పాల్గొన్నారు.
- గాంధీనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రంలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. యోగా గురువులు కోడూరు మల్లికార్జునరావు, కొత్తమాసు నాగేంద్రరావు, కూనల బాపిలాల్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ఎం.సాయికృష్ణ, ఏసుబాబు, అనూష, జగదీశ్వరి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



గంగానమ్మపేట శివాలయంలో శాకంబరి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు



సుల్తానాబాద్‌లో శ్రీ సాయికుమార్ మందిరం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం



మారీసుపేట అప్పలస్వామి గుడిలో బాబావారికి అభిషేకం చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా బౌద్ధ దమ్మ చక్ర పరివర్తన దినోత్సవం



తెనాలిఅర్బన్: బుద్ధుడు తన ఐదుగురు భిక్షువులకు ఆషాఢ పౌర్ణమి రోజున ప్రథమ దమ్మ చక్ర పరివర్తన చేసిన రోజును ప్రపంచ దేశాలన్ని అత్యంత ఘనంగా జరుపుకుంటాయని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుద్దిస్ట్‌లు, అంబేడ్కరిష్టుల సంయుక్త ఆధ్వర్యంలో దమ్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని కఠెవరంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, నవయాన బౌద్ధ సంఘవి అధ్యక్షులు కె.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కె.నాగభూషణం, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు జి.మధుబాబు, దమ్మ బోధకులు అందే శ్యామ్, దాసరి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎంఈఓ-1 గా సాల్మన్‌రాజు బాధ్యతల స్వీకరణ



కొల్లిపర: కొల్లిపర మండల విద్యాశాఖాధికారి(ఎంఈఓ-1)గా జి.సాల్మన్‌రాజు సోమవారం విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాల్మన్‌రాజు ప్రకాశం జిల్లాలోని పామూరు గ్రామంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో ప్రధాన ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై కొల్లిపర మండలం విద్యాశాఖా కార్యాలయంలో ఎంఈఓ -1 గా వచ్చినట్లు తెలిపారు. మండల విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎం.రమేష్, ఎంఆర్‌సీఎస్ పి.రమేష్‌బాబు అభినందనలు తెలిపారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు



గుంటూరు మెడికల్: జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌ను సోమవారం ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ యూనియన్ (వైఎస్సార్ ట్రేడ్ యూనియన్) జీజీహెచ్ శాఖ అధ్యక్షుడు వి.యోహాన్ ఆధ్వర్యంలో పలువురు యూనియన్ నాయకులు కలిసి శాలువా కప్పి సత్కరించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా ఆసుపత్రిలో చేసిన వైద్య సేవల గురించి యూనియన్ నేతలు కొనియాడారు. అభినందనలు తెలిపిన వారిలో యూనియన్ నాయకులు నన్మత్‌కుమార్, ఎం.వి.రత్నం, గాబ్రియేల్, సుబ్బారావు, తిరుమలాదేవి, సుశీల్‌కుమార్, మనోజ్‌కుమార్, మేడిదబాబు తదితరులు ఉన్నారు.

సిరంజీలు అందజేస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

నూతనంగా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కిరణ్‌కుమార్‌ను ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలిసి శాలువా కప్పి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. రోగుల వినియోగం కోసం గ్లౌజులు, సిరంజీలు ఏపీ ఎన్జీవో నేతలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ సతీష్ కుమార్, నగర అధ్యక్షుడు సూరి, నగర సెక్రటరీ కళ్యాణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, వెల్లంపల్లి పద్మజ, బెల్లంకొండ శైలజ, రాధారాణి, కూరాకుల శ్రీనివాస్, లంకపల్లి శ్రీనివాస్, గాబ్రియేల్ పాల్గొన్నారు.

ఆగస్టు 15 నాటికి డంపింగ్ యార్డు స్థలంలో పార్కు నిర్మాణం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రు రోడ్ రైల్వేగేటు వద్ద గల డంపింగ్‌యార్డు స్థలాన్ని ఆగస్టు 15 నాటికి పార్కుగా నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మె ల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. సోమవారం ఆయన నగర పాలక సంస్థ అధికారులతో కలసి డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ డంపింగ్ యార్డు తరలింపు పనులను ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులు దాదాపూ పూర్తి చేశారని, అయితే ఆగస్టు 15వ తేదీ నాటికి పార్కు నిర్మాణం పూర్తి చేసే విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పక్కన ఎంపీపీ పద్మావతి తదితరులు

ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: వైఎస్సార్ సీపీ సర్కారు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాలలో మండల స్థాయి జగనన్న అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు తల్లలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆమె ఖాతాలో అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15వేలు జమ చేస్తున్నట్లు చెప్పారు. కొల్లిపర మండలంలో 3,698 మంది తల్లుల ఖాతాలకు రూ.5,54,70 కోట్ల అమ్మ ఒడి నగదు నేరుగా వారి ఖాతాలో జమ కానున్నట్లు తెలిపారు. అనంతరం వికలాంగుల కార్పొరేషన్ ద్వారా మండలంలోని ఇద్దరు వికలాంగులకు ట్రై మోటార్ సైకిల్‌లను ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ పద్మావతి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పాఠశాల చైర్మన్ ఆరిమండ మాధవి, ఎంపీటీసీ కేసన శ్రీలత, ఎంపీటీసీ 2 చిలువూరి ఝాన్సీ, ఎంఈఓలు సాల్మన్‌రాజ్, ఝాన్సీలత, తెనాలి ఎంఈఓ లక్ష్మీనారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి ప్రభాకర రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం భూపతి నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు భీమవరపు శివకోటిరెడ్డి, పిల్లి గంగాధర్, కొల్లి రాఘవరెడ్డి, మండల విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎం.రమేష్, ఎంఆర్‌సీఎస్ పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

తెనాలిఅర్బన్: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి పట్టణ ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ కె జగన్ సాథ్ కార్యక్రమాన్ని శివాజీచౌక్‌లోని జామియా మసీదులో సోమవారం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో ప్రత్యేకంగా సమావేశమయ్యే మసీదుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ముస్లిం మైనార్టీలకు తాను ఇచ్చినట్లు చెప్పారు. ముస్లింల కోసం షాదీఖానా నిర్మించేందుకు సీఎం జగన్‌తో మాట్లాడి అనుమతులు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. వక్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ జిలానీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముస్లిం మైనార్టీలకు పెద్దపీత వేశారని చెప్పారు. అనంతరం హర్ దిల్ మే వైఎస్సార్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగ అధ్యక్షుడు హబీబుల్లా, ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, కౌన్సిలర్లు దుబాయ్‌బాబు, షేక్ ఇస్మాయేల్, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, నాయకులు డాక్టర్ రియాజ్‌ఖాన్, సాయిబాబా మాస్టార్, షేక్ మీరావలి, టెక్స్ బాల, జానీ, షేక్ సిలార్‌జానీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. గ్రామానికి చెందిన రావినూతల సాంబశివరావు జయంతి సందర్భంగా రావినూతల సాంబశివరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రావినూతల శ్రీ రామమూర్తి, సభ్యులు రావినూతల ప్రకాష్ పాల్గొన్నారు.

ఇందిరానగర్‌వాసుల సమస్యల పరిష్కారానికి కృషి



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- నందివెలుగు ఇందిరానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలి టౌన్: నందివెలుగు దళితవాడ ఇందిరానగర్‌లో రూ.40లక్షలతో సచివాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూరల్ మండలంలోని నందివెలుగులో సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరానగర్ ప్రజలు శ్మశాన వాటికకు స్థల సేకరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముస్లింలకు షాదీఖానా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలకు నాడు-నేడు కింద రూ.16లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచి దూళిపాళ్ల పవన్‌కుమార్, ఎంపీటీసీ షేక్ సిలార్‌జానీ, సొసైటీ చైర్మన్ తోటకూర వసంతరావు, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌చంద్రబోస్, వేముల మహేష్, షేక్ రబ్బానీ, పంచాయతీ మెంబర్ వేముల రమాదేవి, బెజ్జం బాజి, మంగా శివనాగేశ్వరరావు, చిట్టిబాబు, బొంతు నరేంద్రరెడ్డి, తన్వీరు, వెంకటేశ్వరరావు, షేక్ లడ్డూ, సుభానీ, అబూ సాలేషా, బాసిద్, దూళిపాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడిగా రాంబాబు

తెనాలిఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం నూతన అధ్యక్షుడిగా పావులూరి రాంబాబు, కార్యదర్శిగా నల్లూరి వెంకటేశ్వరరావు, ట్రెజరీగా కెఎల్.జగదీశ్వరాంబ ఆదివారం తెనాలిలోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. వీరితో క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే నూతనంగా క్లబ్ సభ్యత్వాన్ని తీసుకున్న వారితో డెప్యూటీ గవర్నర్ కన్నెగంటి మురళీ కృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పవర్‌లిఫ్టర్ షేక్ షబీనాను ఘనంగా సన్మానించి ఈదర వెంకట పూర్ణచంద్ సహకారంతో రూ.10వేలు అందజేశారు. త్వరలో ఆమె అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనున్న నేపథ్యంలో క్లబ్ ఆధ్వర్యంలో రూ.50వేల నగదును అందజేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, క్లబ్ ప్రతినిధులు జేఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.



పవర్ లిఫ్టర్ షేక్ షబీనాను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

రాజకీయ చరిత్రలో వారాహి యాత్ర అద్భుత ఘట్టం



తెనాలిఅర్బన్: రాష్ట్ర రాజకీయ చరిత్రలో వారాహి యాత్ర అద్భుత ఘట్టమని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అభివర్ణించారు. తెనాలిలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారాహి యాత్రకు విశేష ప్రజాదరణ లభించిందని చెప్పారు. మలివిడత వారాహి యాత్ర షెడ్యూలను త్వరలో ప్రకటిస్తామని వివరించారు. జగన్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదని విమర్శించారు. జగనన్న సురక్షపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవిశంకర్, నాయకులు ఇస్మాయేల్ బేగ్, తోటకూర రమణరావు, పసుపులేటి మురళీకృష్ణ, జాకీర్ హుసేన్, హరిదాసు గౌరిశంకర్, దివ్వెల మధుబాబు, యర్రు వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో ధ్యానంపై శిక్షణ

తెనాలిఅర్బన్: యోగ సత్సంగ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధ్యానంపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. నాజర్‌పేటలోని ఎస్వీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సత్సంగం ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానందగిరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.

ఫిర్యాదులు పరిష్కరించాల్సింది విభాగాధిపతులే

- ఏ ఒక్క సమస్య పునరావృతం కాకూడదు
- నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్సప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల నేరుగా రాష్ట్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని, ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం యాక్షన్ ప్లాన్ సచివాలయాల వారీగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్ డేట్స్ ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్ లో పోస్ట్ చేసి, పరిష్కారాల పై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు.

ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డ్ సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 8, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 1, ఉపాసెల్ విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 8, పరిపాలన విభాగానికి 1 చొప్పున ఫిర్యాదు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

దుర్గమ్మకు రూ.4 లక్షల విలువైన బంగారం హారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు మంగళగిరికి చెందిన భక్తులు సోమవారం రూ. 4 లక్షల విలువైన బంగారపు హారాన్ని కానుకగా సమర్పించారు. మంగళగిరికి చెందిన భోగి సన్యాసిరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ. 4 లక్షల విలువైన 65 గ్రాముల బంగారంతో తయారు చేయించిన ఫ్యాన్సీ హారాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబుకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో కాళహస్తి దేవస్థానం చైర్మన్ ఏ. శ్రీనివాసులు, ఈవో కేవీ సాగర్‌బాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.